

సోమశిలలో 68.476 టీఎంసీలు

సోమశిల: జలాశయంలో ఆదివారానికి 68.476 టీఎంసీలు ఉన్నాయి. ఎగువ నుంచి 5,850 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా, డెల్టాకు 2,150, ఉత్తరకాలువకు 700, కండలేరుకు 2,600, దక్షిణ కాలువకు 400 క్యూసెక్కుల విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రాములు)	రూ.79,770
22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రా)	రూ.7,275
మూడు శాతం జీఎస్టీతో	రూ.7,493
సవర (8 గ్రాములు)	రూ.59,944

గరిష్టం/కనిష్టం
33.6 /26.0

వాతావరణం

జిల్లాలో సోమవారం వాతావరణం పొడిగా ఉంటుంది. రాత్రి సమయంలో ఆకాశం మేఘావృతం ఉండే అవకాశం. ఆదివారం గాలిలో తేమ 69 శాతం ఉంది.

న్యూస్‌రీల్

శ్రీసాయిసచ్చరిత్ర శోభాయాత్ర



శ్రీసాయిసచ్చరిత్ర గ్రంథంతో శోభాయాత్ర నిర్వహిస్తున్న సాయిభక్తులు

నెల్లూరు (బృందావనం): బాలాజీనగర్ శివారు పద్మావతినగర్‌లో కొలువైన శ్రీసాయిదర్బార్ అద్దాల మందిరం ఆధ్వర్యంలో శ్రీసాయిసచ్చరిత్ర శోభాయాత్రను ఆదివారం నగరంలో వైభవంగా నిర్వహించారు. శ్రీసాయి మాలధారణ, షిర్డీయాత్రను పురస్కరించుకుని శ్రీసాయి నామ సంకీర్తనలతో శ్రీసాయి సచ్చరిత్ర పవిత్ర గ్రంథాన్ని శిరస్సుపై ధరించి 500 మందికి పైగా సాయిభక్తులు కనుల పండువగా శోభాయాత్ర నిర్వహించారు. తొలుత శ్రీసాయిదర్బార్ అద్దాల మందిరంలో సాయినాథుడికి విశేష పూజలు నిర్వహించారు. అనంతరం శ్రీసాయి సచ్చరిత్ర గ్రంథంతో సాయినామ సంకీర్తనలు, భక్తిగీతాలతో శ్రీసాయిదర్బార్ నుంచి శోభాయాత్రను పద్మావతినగర్, బాలాజీనగర్, ఏసీనగర్, గాంధీబొమ్మ, సుబేదారుపేట, బోసుబొమ్మ, ఆత్మకూరు బస్టాండ్ మీదుగా మందిరం చేరింది. మందిరం మేనేజింగ్ ట్రస్టీ మధుసాయి మాట్లాడుతూ ప్రతి ఏటా శ్రావణ మాసంలో షిర్డీ పుణ్యక్షేత్రంలో శ్రీసాయినామ సప్తాహ పారాయణం అనంతరం శ్రీసాయి సచ్చరిత్ర శోభాయాత్రను చేపడతారన్నారు. అదే రీతిన షిర్డీ సంప్రదాయంగా నగరంలో 3వ పర్యాయం శోభాయాత్ర నిర్వహించామన్నారు. మందిరం గౌరవ అధ్యక్షుడు పాబోలు రామసుబ్బయ్య పాల్గొన్నారు.

కారు ఢీకొని యువకుడి దుర్మరణం



మహేష్ (ఫైల్)

కందుకూరు: రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు అక్కడికక్కడే మృతి చెందిన ఘటన ఆదివారం కందుకూరులో జరిగింది. మండలంలోని మోపాడుకు చెందిన తోకల మహేష్ (32) స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డు చెక్‌పోస్టు వద్ద సెక్యూరిటీ గార్డుగా విధులు నిర్వహిస్తున్నాడు. ఆదివారం కందుకూరు నుంచి చెక్‌పోస్టు వద్ద విధులకు హాజరయ్యేందుకు ద్విచక్ర వాహనంపై బయలుదేరాడు. ఓవీ రోడ్డులో వెనుక వైపు నుంచి కారు ఢీకొట్టింది. దీంతో మహేష్ రోడ్డుపై పడడంతో తలకు బలమైన గాయాలయ్యాయి. స్థానికులు ఆటోలో ఏరియా హాస్పిటల్‌కు తీసుకెళ్లారు. అయితే అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడు మహేష్‌కు భార్య, ఇద్దరు పిల్లలున్నారు. కేసు నమోదు చేసుకున్న రూరల్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా కార్యకర్తగా

మృతుడు మహేష్ వైఎస్సార్‌సీపీలో బలమైన కార్యకర్తగా ఉన్నారు. పార్టీ తరఫున సోషల్ మీడియా కార్యకర్తగా కొన్ని సంవత్సరాలుగా కొనసాగుతున్నాడు. పలువురు నాయకులు, సోషల్ మీడియా కార్యకర్తలు మహేష్ మృతి పట్ల దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

అడిగేదెవరు.. ఆపేదెవరు


పెన్నమ్మలో ఇసుక దొంగలు

జిల్లాలో ఇసుక అక్రమ రవాణాలో పచ్చముఠా రోజురోజుకు పేట్రేగిపోతోంది. పెన్నాతీరం వెంబడి నియోజకవర్గాల్లో టీడీపీ నేతలు బరితెగించి అనధికారికంగా అడ్డగోలుగా దోపిడీ చేస్తున్నారు. అధికారం మాదే.. అడిగేదెవరు.. ఆపేదెవరు అని రెచ్చిపోతున్నారు. అధికారికంగా యంత్ర రహితంగా నాలుగు రీచ్‌లు ఏర్పాటు చేసినా.. అనధికారికంగా నలభై రీచ్‌ల నుంచి ఇసుక అక్రమ రవాణా చేస్తున్నారు. ఇసుక అక్రమ రవాణా చేసినా, రీచ్‌ల్లో యంత్రాలు పెట్టి తవ్వకాలు చేసినా కఠిన చర్యలు తీసుకుంటామంటూ సీఎం చంద్రబాబు చెబుతున్న మాటలు.. ఉత్తివే అని తేటతెల్లమవుతున్నాయి.



పెన్నానది ఇసుక రీచ్‌లో బారులు తీరిన ట్రాక్టర్లు

- అధికారికంగా నాలుగు.. అనధికారికంగా నలభై రీచ్‌లు
- రీచ్‌లో వందల ట్రాక్టర్ల మోహరింపు
- పగలు ట్రాక్టర్లు.. రాత్రిళ్లు టిప్పర్లు, లారీలు
- పక్క రాష్ట్రాలకు రోజుకు 400 టిప్పర్లు, లారీల్లో ఇసుక అక్రమ రవాణా
- ప్రతి రీచ్ నుంచి స్థానిక ప్రజా ప్రతినిధికి రోజుకు రూ.5 లక్షల కమీషన్
- నెల్లూరు, కోవూరు, ఆత్మకూరు, సర్వేపల్లిలో బరితెగిస్తున్న టీడీపీ నేతలు
- మామూళ్లతో అధికారుల మౌనం
- ఇసుక పాలసీ తూచ్



సాక్షి ప్రతినిధి, నెల్లూరు: జిల్లాలో ప్రకటించిన ఇసుక పాలసీని టీడీపీ నేతలు పెన్నానదిలో నిమజ్జనం చేశారు. పాలకులు, అధికారులు చెబుతున్న మాటలకు క్షేత్రస్థాయిలో ఉన్న పరిస్థితికి పొంతన లేదు. అధికారం అండతో ఇసుకాసురులు విచ్చలవిడిగా వ్యవహరిస్తున్నారు. రేయింబవళ్లు పెన్నానదిని కుళ్లబొడిచేస్తున్నారు. అధికారిక రీచ్‌లతో పాటు అనధికారిక రీచ్‌లు స్థానిక ప్రజాప్రతినిధులు గుత్తాధిపత్యంలోకి వెళ్లిపోయాయి. యంత్రాలు పెట్టి భారీ వాహనాలు, టిప్పర్ల సాయంతో ఇసుక దోపిడీ చేస్తున్నారు. పగలంతా ట్రాక్టర్లతో బయట యార్డుల్లో డంప్ చేస్తున్నారు. రాత్రి పూట రోజుకు 400 టిప్పర్లు, లారీల్లో పక్క రాష్ట్రాలకు తరలిస్తున్నారు. సాయంత్రం ఆరు గంటలు దాటితే నదిలోకి వాహనాల క్యూ కడుతున్నాయి. జిల్లాలోని ఆత్మకూరు నియోజకవర్గంలోని సోమశిల దిగువ నుంచి సర్వేపల్లి, నెల్లూరు రూరల్, నెల్లూరుసిటీ మీదుగా కోవూరు నియోజకవర్గంలోని ఇందుకూరుపేట వరకు పెన్నానదిలో ఊరుకో రీచ్‌ను ఏర్పాటు చేసి ఇసుకను అక్రమంగా రవాణా చేస్తున్నారు.

జిల్లాలో అధికారికంగా యంత్ర రహితంగా ఇసుక తవ్వకాలకు ఇటీవల నామినేషన్ పద్ధతిలో నిర్దిష్ట పరిమితిలో కలెక్టర్ నేతృత్వంలో అనుమతులు ఇచ్చారు. ఈ మేరకు ఇసుక పాలసీని ప్రకటించారు. అయితే ఇందుకు భిన్నంగా దాదాపు 40 రీచ్‌ల ద్వారా ఇసుకను తోడేస్తున్నారు. వాస్తవానికి జిల్లాలో ఇసుక తవ్వకాలకు నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ ఇచ్చే పర్యావరణ అనుమతులు కూడా లేకపోవడం గమనార్హం.

పొర్లుకట్టలు ధ్వంసం చేసి.. పక్కాగా రోడ్లు..

పెన్నానది నుంచి ఇసుక అక్రమ రవాణాకు వీలుగా నది పొర్ల కట్టలు ధ్వంసం చేసి పటిష్టంగా రోడ్లు వేస్తున్నారు. గ్రావెల్‌తో రోడ్లు నిర్మించి పైన ఫ్లైయాష్ పోస్తున్నారు. పర్యావరణ నిబంధనల ప్రకారం నదిలోకి రోడ్లు వేయకూడదు. కానీ ఎన్‌జీటీ అనుమతులు లేకుండా ఆగమేఘాల మీదు రోడ్లు ఏర్పాటు చేస్తున్నా.. జిల్లా అధికారులు సైతం వారించడం లేదనే విమర్శలు ఉన్నాయి. అధికార పార్టీ నేతల ఒత్తిళ్లకు తలొగ్గి వ్యవహరిస్తున్న అధికారులు రేపటి రోజున భారీ మూల్యం చెల్లించుకోక తప్పదని నిజాయితీపరులైన అధికార వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.





పీకేపాడు రీచ్ నుంచి రాత్రి వేళల్లో లోడింగ్ చేసుకుని కడప, బెంగళూరుకు వెళ్తున్న వాహనాలు

రేయింబవళ్లు రీచ్‌ల్లోనే..

జిల్లాలోని పెన్నానదిలో సంగం, సూరాయపాళెం, పోతిరెడ్డిపాళెం వద్ద డ్రెడ్జింగ్ విధానంలో ఇసుక తవ్వకాలు చేపడుతున్నారు. ఈ తవ్వకాలపై హైకోర్టు ఆంక్షలు విధించినా.. ధిక్కరించి టీడీపీ నేతలు ఇష్టారాజ్యంగా తవ్వకాలు చేస్తున్నారు. ఆయా రీచ్‌ల్లో షాడో ఎమ్మెల్యేలు ప్రతి రోజు 300కు పైగా వాహనాలతో అనధికారికంగా రాత్రి, పగలు తేడా లేకుండా ఇసుక తరస్తున్నారు. రాత్రి వేళల్లోనే రోజుకు సగటున 1.2 లక్షల మెట్రిక్ టన్నుల ఇసుక అక్రమ రవాణా సాగుతున్నట్లు గణాంకాలు చెబుతున్నాయి.

➡ పెన్నానదిలో ఓపెన్ రీచ్‌లకు ఎలాంటి అనుమతులు లేవు. కోవూరు నియోజకవర్గం మినగల్లులో ఎమ్మెల్యే బంధువు విచ్చలవిడిగా ఇసుక తవ్వకాలు చేస్తున్నాడు.

➡ ఆత్మకూరు నియోజకవర్గంలోని పీకేపాడు రీచ్‌కు అనుమతులు లేకున్నా.. రాయలసీమకు చెందిన ఓ ముఠా తిష్టవేసింది. నిత్యం రాత్రి వేళల్లో వందకు పైగా 12 చక్రాల టిప్పర్లు, 10 చక్రాల టిప్పర్లతో పాటు, లారీలు (16 చక్రాలు) ద్వారా ఇసుక దోపిడీ చేస్తున్నారు. పీకే పాడు నుంచి ప్రకాశం, కడప ఉమ్మడి జిల్లాలతో పాటు కర్ణాటకకు తరలివెళ్తోంది.

➡ నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో పొట్టేపాళెం రీచ్‌లో రాత్రి ఏడు గంటల తర్వాత స్థానిక టీడీపీ నేత సారథ్యంలో వంద వాహనాల్లో ఇసుక తరస్తున్నారు. భారీ యంత్రాలతో లోడింగ్ చేసి అక్కడి నుంచి తమిళనాడు, శ్రీసిటీ, జిల్లాలోని లే అవుట్‌లకు తరలిస్తున్నారు. రాత్రి వేళల్లో నగరంలోని ఎస్పీ కార్యాలయం మీదుగానే ఇసుక అక్రమ రవాణా జరుగుతోంది.

➡ విరువూరు, సూరాయపాళెం రీచ్‌ల్లో రాయలసీమ, కృష్ణా జిల్లాలకు చెందిన ఇద్దరు వ్యక్తులు స్థానిక షాడో ఎమ్మెల్యేతో ఒప్పందం చేసుకుని రోజువారీ కలెక్షన్లు ఇచ్చుకుని రాత్రి వేళల్లో వందకు పైగా టిప్పర్లు, లారీలతో ఇసుక రవాణా సాగిస్తున్నారు.

➡ నెల్లూరు నగరపరిధిలో భగత్‌సింగ్ నగర్, దీనదయాళ్ కాలనీ నుంచి షాడో మంత్రిగా వ్యవహరిస్తున్న మాజీ కార్పొరేటర్ ఇసుక అక్రమ రవాణా సాగిస్తున్నారు.

ఇసుక పాలసీ నిబంధనలు

వాహనాలు నేరుగా రీచ్‌ల్లోకి వెళ్లడానికి వీల్లేదు. స్టాక్ పాయింట్లలో ఉదయం 6 నుంచి సాయంత్రం 6 గంటల వరకే లోడింగ్ చేయాలి. అయితే ఇందుకు భిన్నంగా టీడీపీ నేతలు స్టాక్ పాయింట్ల నుంచి రాత్రి వేళల్లో కూడా లోడింగ్ చేస్తున్నారు. ట్రాక్టర్ల యజమానులు సొంత అవసరాల కోసమే తీసుకెళ్లాలి. అయితే రోజుకు జిల్లా మొత్తంగా 5 వందల ట్రాక్టర్ల ఇసుక అక్రమ రవాణా సాగిస్తున్నారు. ప్రస్తుతం స్టాక్ పాయింట్ల హైకోర్టు ఆదేశాల ప్రకారం చూస్తే అనధికారికంగా లోడింగ్ చేస్తున్నట్లు చూడాలి.

అధికారులకు మామూళ్లు

పెన్నానది నుంచి రాత్రి వేళల్లో తరలించే ఇసుక అక్రమ రవాణాకు పోలీస్, ఆర్టీఏ అధికారులు నెలవారీ మామూళ్లు అందుతున్నాయనే ఆరోపణలున్నాయి. ఇతర రాష్ట్రాలకు వెళ్లాలన్నా, జిల్లా సరిహద్దులు దాటాలంటే ప్రతి వాహనానికి నెలవారీ రూ.లక్ష నుంచి రూ.2 లక్షల వరకు చెల్లించాలి. పోలీస్, ఆర్టీఏ అధికారుల దళారులకు ఈ మామూళ్లు ఇచ్చుకుంటే ఆ వాహన నంబర్ ఆయా శాఖల అధికారులకు పంపుతారు. మామూళ్లు ఇచ్చుకున్న వాహనాన్ని ఎవరూ ఆపరు. నెలకు రూ.5 కోట్ల వరకు మామూళ్ల రూపంలో అధికారులకు అందుతున్నాయని ప్రచారం ఉంది. ఇక మైనింగ్, రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులకు సపరేటు రేటు ఫిక్స్ చేసి ఇస్తున్నారని సమాచారం.

లోడింగ్‌కు రూ.12 వేలు ఫిక్స్

పెన్ననదిలో భారీ యంత్రాలతో వాహనాలకు లోడింగ్ చేసేందుకు రేటు ఫిక్స్ చేశారు. వాస్తవానికి అధికారిక రీచ్‌లకే యంత్రాలు పెట్టకూడదని నిబంధనలు ఉన్నాయి. కలెక్టర్, ఎస్పీ, మైనింగ్ శాఖల నేతృత్వంలో ప్రకటించిన ఇసుక పాలసీ టీడీపీ నేతల దృష్టిలో దోపిడీ పాలసీగా మారింది. పీకేపాడు, పొట్టేపాళెం, విరువూరు, సూరాయపాళెం, సంగం, పోతిరెడ్డిపాళెం నుంచి పది టైర్ల వాహనాలకు లోడింగ్ చేస్తే రూ.10 వేలు, 12 టైర్లు వాహనాలకు రూ.2 వేలు, ఆపై ఎన్ని టైర్లు ఉన్నా రూ,15 వేలు వంతున రేటు ఫిక్స్ చేసి లోడింగ్ చేస్తున్నారు. ట్రాక్టర్లకు రూ.వెయ్యి వంతున వసూలు చేస్తున్నారు. లోడింగ్ ద్వారానే రోజుకు రూ.48 లక్షల వరకు రాబడి ప్రజా ప్రతినిధుల జేబుల్లోకి వెళ్తోంది.



విరువూరు, సూరాయపాళెం రీచ్‌ల నుంచి రాత్రి వేళ ఇసుక లోడింగ్ చేసుకుని వెళ్తున్న వాహనాలు



కోవూరు షుగర్ ఫ్యాక్టరీ వద్ద ఇసుకను తరలించేందుకు సిద్ధంగా ఉన్న టిప్పర్



నెల్లూరురూరల్ మండలం పొట్టేపాళెంలో అనధికార ఇసుక రీచ్‌లో ఇరుక్కుపోయిన ట్రాక్టర్లను మరో ట్రాక్టర్ సహాయంతో లాగుతున్న దృశ్యం

ప్రశ్నించే గళాలపై ఖాకీ క్రౌర్యం

- మాజీమంత్రి కాకాణి పైనే మూడు కేసుల నమోదు
- వైఎస్సార్‌సీపీ, సోషల్ మీడియా కార్యకర్తల అరెస్టులు
- దళిత మహిళా విలేకరిపై రెండు కేసులు..
- జిల్లాలో రెడ్‌బుక్ రాజ్యాంగానికి పోలీసుల గులాంగిరీ



అప్రకటిత ఎమర్జెన్సీ పరిస్థితులు నెలకొన్నాయి. అడ్డగోలు హామీలతో అధికారాన్ని చేజిక్కించుకున్న కూటమి ప్రభుత్వం రెడ్‌బుక్ రాజ్యాంగంతో రెచ్చిపోతోంది. సూపర్ సిక్స్ పథకాలంటూ ఊదరగొట్టిన కూటమి నేతలు.. ఆచరణలో అమలు చేయకపోగా సహజ వనరుల నుంచి సంపద వనరుల వరకు అడ్డంగా దోచుకుంటున్నారు. అధికారం దక్కిన రోజు నుంచి హత్యలతో టీడీపీ కిరాతక మూకలు అట్టుడికించారు. మరోవైపు బాలికలపై లైంగిక దాడులు, హత్యలతో శాంతిభద్రతలను మంటగలిపారు. ఇంకో వైపు ఇసుక, గ్రావెల్, మద్యంతో అక్రమార్జన సాగిస్తున్నారు. ప్రభుత్వ విధానాలను ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా, సోషల్ మీడియా వేదికగా నిలదీస్తున్న సామాన్య ప్రజలు, వైఎస్సార్‌సీపీ కార్యకర్తలతోపాటు ఏకంగా మాజీమంత్రిపై కేసులు పెట్టి వేధిస్తున్నారు. ప్రశ్నించే గళాలపై అధికార పార్టీ నేతల అండ చూసుకుని ఖాకీలు క్రౌర్యం ప్రదర్శిస్తున్నారు.

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: ప్రభుత్వ అసమర్థత, వైఫల్యాలను ప్రశ్నించే సోషల్ మీడియా గళాలను ఖాకీలు నొక్కేస్తున్నారు. ఉక్కు సంకెళ్లు బిగించి ప్రతి స్టేషన్ తిప్పుతూ అక్కడ థర్డ్ డిగ్రీ ఉపయోగిస్తున్నారు. రాజ్యాంగం కల్పించిన పౌరుల స్వేచ్ఛను హరిస్తున్నారు. మీడియా, ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా సమావేశాలతో పాటు సోషల్ మీడియాల్లో టీడీపీ ప్రతిపక్షంలో ఉండగా పెట్టిన పోస్టులపైనా కేసులు పెట్టి వేధిస్తున్నారు. వాట్సప్ గ్రూపుల్లో మెసేజ్‌లు పార్వర్డ్ చేసిన వారిని వదిలి పెట్టడం లేదు. ఎక్కడికక్కడ టీడీపీ నేతలతో ఫిర్యాదులు చేయించడం, ఎక్కడెక్కడో వారిని ఇక్కడకు తీసుకొచ్చి కేసులు పేరుతో వేధిస్తున్నారు. పోస్టింగ్‌లు పెడితేనే అట్రాసిటీ కేసులు నమోదు చేస్తున్నారు. ప్రభుత్వ వైఫల్యాలతో పాటు స్థానిక ఎమ్మెల్యే అవినీతిని ప్రశ్నించిన మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డిపై మూడు కేసులు నమోదు చేయడం చూస్తే రెడ్‌బుక్ రాజ్యాంగం పరాకాష్టకు అద్దం పడుతోంది. జిల్లాలో పోలీసులు అధికార పార్టీ నేతలు ఆడినట్లు ఆడుతున్నారు. సీఎం చంద్రబాబు, డీసీఎం పవన్‌కళ్యాణ్‌పై వ్యతిరేక పోస్టులు పెడుతున్నారని సాకులు చూపుతూ పోలీసులు కేసులు నమోదు చేసి రోజుల తరబడి వేధిస్తూ మానసికంగా వేధిస్తున్నారు.

ప్రకాశం జిల్లా వాసిని తీసుకొచ్చి ..

ప్రకాశం జిల్లాకు చెందిన హరీశ్వర్‌రెడ్డి హైదరాబాదులో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేసుకుంటున్నాడు. అతను ఇటీవల విజయవాడ వరదల సమయంలో ప్రభుత్వానికి వ్యతిరేక పోస్టులు పెట్టాడని నెల్లూరు రూరల్ స్టేషన్‌లో, మూడేళ్ల కిందట అప్పటి టీడీపీ మహిళా అధ్యక్షురాలు అనితపై పోస్టు పెట్టారని కోవూరు స్టేషన్‌లో అట్రాసిటీ కేసు నమోదు చేశారు. హైదరాబాద్ నుంచి తీసుకొచ్చి మూడు రోజుల పాటు విచారణ పేరుతో వేధించి నోటిసు ఇచ్చి తిరుపతి పోలీసులకు అప్పగించారు. అక్కడా వేధించి చివరకు రిమాండ్‌కు పంపారు.

కాకాణిపై కేసులు

పోలీసుల వేధింపులు మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డికి తప్పలేదు. గుంటూరు జిల్లా తాడేపల్లిలో వైఎస్సార్‌సీపీ సెంట్రల్ కార్యాలయంలో ప్రెస్‌మీట్ పెడితే ఆ వార్తను 'సాక్షి' కవర్ చేసింది. ఆ పేపర్ కటింగ్‌ను సోషల్ మీడియాలో తన వాట్సాప్‌లో పార్వర్డ్ చేశాడని వెంకటాచలం పోలీసులకు స్థానిక టీడీపీ నేత ఫిర్యాదు చేస్తే కేసు నమోదు చేశారు. వెంకటాచలం మండలానికి చెందిన బీజేపీ నేత నెల్లూరులో ప్రెస్‌మీట్ పెడితే ఆ వీడియో గోవర్ధన్‌రెడ్డి వాట్సాప్ గ్రూపుల్లో పార్వర్డ్ చేశాడని మరో కేసు నమోదు చేశారు. స్థానిక ఎమ్మెల్యే సోమిరెడ్డిపై అసభ్యకరంగా పోస్టింగ్ పెట్టాడని ముత్తుకూరు పోలీస్‌స్టేషన్‌లో టీడీపీ నేత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

వింజమూరులో..

ఉదయగిరి నియోజకవర్గం వింజమూరుకు చెందిన శివారెడ్డిని ఇప్పటికే రెండు పర్యాయాలు పోలీసులు అదుపులోకి తీసుకుని వేధించారు. మరోసారి కృష్ణా జిల్లాలో కంకిపాడు పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేసి నోటీసు పంపారు. మూడేళ్ల కిందట పోస్టింగ్‌లు పెట్టారని ఇలా వేధింపులకు గుర్తి చేస్తున్నారు.

– ఉదయగిరి మండలం బండగానిపల్లి గ్రామానికి బేరి తిరుపతిరెడ్డి గత నెలలో తిరుమల తిరుపతి లడ్డూకు సంబంధించి చంద్రబాబు చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ సీఎం చంద్రబాబుని దూషిస్తూ పోస్టింగ్‌లు పెట్టారు. దీంతో పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేసి అరెస్టు చేసి కోర్టుకు పంపగా బెయిల్‌పై విడుదలయ్యారు.

కావలిలో రెడ్‌బుక్ రాజ్యాంగం

కావలి వన్ టౌన్, బిట్రగుంట, దగదర్తి పోలీస్‌స్టేషన్లలో దాదాపు ఎనిమిది మంది వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై కేసులు నమోదు చేశారు. కావలికి చెందిన ఆత్మకూరు రాజేష్, దామెర్ల శ్రావణ్‌కుమార్‌పై కేసు నమోదు చేశారు. బోగోలు మండలానికి చెందిన ఎం. వీరరఘు, మేకల శ్రీనివాసులు, ఏకే సుందరరాజు, ఉప్పాల మాచర్ల, కుందుర్తి శ్రీనివాసులుపై ప్రభుత్వ అసమర్థ విధానాలను వాట్సాప్ గ్రూపుల్లో వచ్చిన పోస్టులను పార్వర్డ్ చేశారని కేసులు నమోదు చేశారు.

మహిళా విలేకరిపై రెండు కేసులు

కావలికి చెందిన ఓ దినపత్రిక విలేకరి సబ్బా ప్రభావతిపై కావలి, దగదర్తి పోలీస్‌స్టేషన్లలో కేసులు నమోదు చేశారు. స్థానిక సమస్యలతో పాటు దగదర్తిలో టీడీపీ నేత తన స్నేహితులతో కలిసి వ్యవసాయ భూముల్లో ఉన్న గెస్ట్‌హౌస్‌లో మందు పార్టీ చేసుకున్నారు. ఆయా పోస్టులను ఆమె వాట్సప్ గ్రూపుల్లో పోస్టు చేశారు. ఆమెపై ఎఫ్ఐఆర్ నమోదు చేసి నోటీసులతో వేధిస్తున్నారు.


అక్రమ అరెస్టులు ఆపాలి



సోషల్ మీడియాలో పోస్టు పెట్టారన్న కారణంతో అక్రమ అరెస్టులు చేయడం సరికాదు. ప్రతిరోజు ఎవరో ఒకరు ఏదో విషయమపై పోస్టులు పెడుతుంటారు. అంతమాత్రాన అరెస్టులు చేసుకుంటూ పోతే జైళ్లు కూడా సరిపోవు. ప్రకాశం జిల్లాకు చెందిన హరీశ్వర్‌రెడ్డి జనవరిలో ప్రస్తుత హోం మంత్రిగా ఉన్న అనితపై పోస్టు పెట్టాడు. అప్పుడంతా మౌనంగా ఉండి ఇప్పుడు కోవూరులో కేసు పెట్టడం ఏమిటి?.

– అత్తిపల్లి అనూప్‌రెడ్డి, కోవూరు

పోస్టు పెట్టినప్పుడు ఏమి చేస్తున్నారు



ఎప్పుడో జనవరిలో పోస్టులు పెడితే ఇప్పుడు అర్ధరాత్రి హడావుడిగా కేసులు కట్టి మానసికంగా హింసించి ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు పెట్టడం సరికాదు. రాష్ట్రంలో జరిగేవన్నీ ప్రజలు గమనిస్తున్నారు. అధికారం అడ్డం పెట్టుకుని ఇలాంటి అక్ర మ అరెస్టులకు పాల్పడితే.. తిరిగి అధికారం మారితే మీ పరిస్థితి ఏమిటో తెలుసుకోవాలి. పోలీసులు సైతం రాజ్యాంగానికి కట్టుబడి పనిచేయాలి.

– చేజర్ల సుధాకర్‌రెడ్డి, కోవూరు

ప్రభుత్వం అణచివేత చర్యలు మానుకోవాలి



వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియాను ప్రభుత్వం అణచివేసే చర్యలను ఆపాలి. ప్రజాస్వామ్యంలో పాలకులు, ప్రభుత్వాలు చేసే తప్పిదాలను బహిరంగంగా విమర్శించే హక్కు రాజ్యాంగబద్ధంగా ప్రతి ఒక్కరికీ ఉంది. సోషల్ మీడియా ప్రతినిధులు సోషల్ మీడియా వేదికగా ప్రశ్నించడాన్ని సహించలేక ప్రభుత్వం కేసులు పెట్టడం దారుణమన్నారు. ఈ పరిణామాలు భవిష్యత్‌లో ఇబ్బందికర పరిస్థితులకు దారితీస్తాయి.

– ఆర్.శ్రీనివాసరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనరు, వింజమూరు

స్వేచ్ఛను హరించడమే



ఓ వర్గాన్ని లక్ష్యంగా చేసుకుని సోషల్ మీడియా యాక్టివిస్టులపై ఈ ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు దుర్మార్గం. పోలీసులు చేస్తున్న అరెస్టులు వ్యక్తుల భావ ప్రకటనా స్వేచ్ఛను కాలరాయడమే. గతంలో ఏ ప్రభుత్వమూ ఇలా వ్యవహరించలేదు. ఇకనైనా ప్రభుత్వం ప్రజాస్వామ్యయుతంగా వ్యవహరించాలి. భావ ప్రకటనా స్వేచ్ఛను కాపాడాలి.

– ఏ తులసీరామ్‌యాదవ్, జట్లకొండూరు, మనుబోలు మండలం

అక్రమ అరెస్టులు సరికాదు



కూటమి ప్రభుత్వం సోషల్ మీడియా యాక్టివిస్టుల గొంతు నొక్కేందుకు అక్రమ అరెస్టులు చేయడం సరికాదు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నిస్తూ, ప్రజలను చైతన్యపరిచే సోషల్ మీడియా యాక్టివిస్టులను వేధింపులకు గురిచేయడం, అక్రమ అరెస్టులు చేయడం చూసి ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వాస్తవాలను ప్రజలకు తెలియజేసే వారి గొంతు నొక్కే ప్రయత్నం చేస్తే ప్రజాగ్రహానికి గురికాక తప్పదు.

– అదపాల ఏడుకొండలు, ఇస్కపాళెం

క్లుప్తంగా

ముమ్మరంగా వాహన తనిఖీలు


బస్సులో తనిఖీలు చేస్తున్న పోలీసులు

నెల్లూరు(క్రైమ్): నేర నియంత్రణ, అక్రమ రవాణా, అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేసేందుకు జిల్లా వ్యాప్తంగా పోలీసు అధికారులు శనివారం అర్ధరాత్రి నుంచి ఆదివారం తెల్లవారుజాము వరకు నాకాబందీ నిర్వహించారు. అన్ని కూడళ్లు, జాతీయ రహదారుల ప్రవేశం, నిష్క్రమణ ప్రాంతాల్లో వాహన తనిఖీలు చేపట్టారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కేసులు నమోదు చేశారు. జరిమానా విధించారు. వాహనాలను సీజ్ చేశారు.

ప్రాణం తీసిన ఈత సరదా

- కావేరి నదిలో మునిగి ముగ్గురు విద్యార్థుల మృతి
- మృతుల్లో నెల్లూరు వాసి

సేలం: ఈత సరదా ముగ్గురు విద్యార్థుల ప్రాణాలను తీసింది. ఈ ఘటన నామక్కల్ జిల్లా పరమతి వేలూరు సమీపంలో చోటుచేసుకుంది. వివరాలు.. పిలిక్కలపాళ్యం సమీపంలోని నాగపాళ్యం ప్రాంతానికి చెందిన చిన్‌రాజ్ కుమారుడు వినీత్ విమల్‌రాజ్ (21) కుమారపాళెంలోని ఓ ప్రైవేట్ కళాశాలలో ఇంజినీరింగ్ చివరి సంవత్సరం చదువుతున్నాడు. అక్కడే ధర్మపురి జిల్లా పాపిరెడ్డిపట్టికి చెందిన దేవరాజ్ కుమారుడు నందకుమార్ (21), నెల్లూరుకు చెందిన షేక్ బైసుల్ రెహమాన్ (21) విద్యనభ్యసిస్తున్నారు. ముగ్గురూ స్నేహితులు. నందకుమార్, రెహమాన్ కాలేజీ హాస్టల్లో ఉండేవారు. వీరు శనివారం వినీత్ ఇంటికి వచ్చారు. అక్కడే భోజనం చేశారు. కావేరి నదిలో స్నానం చేయడానికి వెళ్తున్నామని వినీత్ తన తల్లిదండ్రులకు చెప్పాడు. వెళ్లిన వారు తిరిగి రాకపోవడంతో వినీత్ కుటుంబసభ్యులు నది వద్దకు వెళ్లారు. ముగ్గురి బూట్లు, దుస్తులు, సెల్‌ఫోన్ ఒడ్డున కనిపించాయి. సమాచారం అందుకున్న పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది గల్లంతైన ముగ్గురు విద్యార్థుల కోసం వెతికారు. వారి ఆచూకీ తెలియరాలేదు. ఆదివారం ఉదయం నామక్కల్ అగ్నిమాపక శాఖ సిబ్బంది కూడా కలిసి గాలించారు. నీటిలోపల బండరాళ్ల సందుల్లో చిక్కుకున్న మృతదేహాలను వెలికితీశారు.

నిమ్మ ధరలు (కిలో)

పెద్దవి : రూ.45
సన్నవి : రూ.35
పండ్లు : రూ.20



నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు



బ్రాయిలర్ (లైవ్) :	112
లేయర్ (లైవ్) :	110
బ్రాయిలర్ చికెన్ :	210
బ్రాయిలర్ స్కిన్‌లెస్ :	234
లేయర్ చికెన్ :	187

జీవాల మూగరోదన

- పశువైద్యశాలల్లో వెంటాడుతున్న మందుల కొరత
- నాలుగు నెలలుగా చేతులెత్తేసిన కూటమి ప్రభుత్వం
- గతంలో వివిధ రకాల నిల్వ

కూటమి ప్రభుత్వానికి మూగజీవాల రోదన పట్టడం లేదు. పశు వైద్యశాలల్లో మందుల్లేవు. జీవాలకు రోగం వస్తే చికిత్స అందడం లేదు. గత ప్రభుత్వం గ్రామీణ పశు వైద్యశాలలతో పాటు రైతు భరోసా కేంద్రాల ద్వారా కూడా పశువులు, సన్న జీవాలు, కోళ్లకు వైద్య సేవలందించింది. అత్యవసర వైద్యం కోసం డాక్టర్ వైఎస్సార్ మొబైల్ అంబులెన్స్ క్లినిక్‌లను అందుబాటులోకి తెచ్చింది. నేడు సకాలంలో చికిత్స అందక జీవాలు తల్లడిల్లుతున్నాయి.


వైద్యానికి సంబంధించి సూచనలిస్తున్న అధికారులు (ఫైల్)

నెల్లూరు(సెంట్రల్): జిల్లాలో అనేక రకాల మూగజీవాలున్నాయి. అధికారుల గణాంకాల ప్రకారం ప్రస్తుతం 21.24 లక్షల జీవాలున్నట్లు అంచనా. కాగా మూగజీవాలకు సంబంధించి వైద్యం అందించడానికి 19 వెటర్నరీ వైద్యశాలలు (ఏడీ ఉంటారు), 89 వెటర్నరీ వైద్యశాలలు (వీటిలో డాక్టర్స్ ఉంటారు), 61 గ్రామీణ పశు వైద్యశాలలు (వీటిలో స్టాఫ్ ఉంటారు) ఉన్నాయి. ఇంకా గత ప్రభుత్వంలో ఏర్పాటు చేసిన రైతు భరోసా కేంద్రాలు (ప్రస్తుతం రైతు సేవా కేంద్రాలు) ఉంటాయి. వీటి ద్వారా జీవాలకు వైద్యం అందిస్తుంటారు.

ప్రతి మూడు నెలలకు..

కూటమి ప్రభుత్వం మూగజీవాల విషయంలో నిర్లక్ష్యంగా ఉంది. పశువులకు రోగమొస్తే మందులు ఇవ్వలేని దుస్థితి నెలకొంది. కనీసం అత్యవసర చికిత్సకూ సంబంధిత వైద్యులు వెతుక్కోవాల్సి వస్తోంది. నాలుగు నెలలుగా మందుల కొరత వెంటాడుతోంది. ప్రధానంగా గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పంపిన మందులనే సర్దుబాటు చేస్తూ వచ్చారు. ప్రతి పశువైద్యశాలలో మూడు నెలలకు సుమారు రూ.30 వేల నుంచి రూ.50 వేల వరకు మందులు అవసరమవుతాయి. యాంటీబయాటిక్స్, పెయిన్ కిల్లర్స్, యాంటీ హిస్టమైన్స్, సెలైన్ బాటిల్స్, పెన్సిలిన్, విషపూరితమైన మేత తిన్నప్పుడు వాడే మందులు, బాగా మేత తినడానికి మందులు వాడాల్సి ఉంది. కాల్షియం, ఎముకల పొడి వంటి 300 రకాలకు పైగా మందులు ప్రభుత్వం సరఫరా చేయాల్సి ఉంది. గతంలో పశు వైద్యానికి అవసరమైన మందులపై ఇండెంట్ పెట్టేందుకు జిల్లా స్థాయిలో టెక్నికల్ కమిటీ ఉండేది. వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్లు, ఏరియా వెటర్నరీ హాస్పిటల్స్ ఏడీలు ఇలా.. ఎవరికి వారు తమ పరిధిలోని పశు సంపద ఆధారంగా ఏ మందులు అవసరమనే దానిపై ఇండెంట్ పెట్టుకునే వెసులుబాటు కల్పించింది.

జిల్లాలో..

ఆవులు, గేదెలు, ఎద్దులు : సుమారు 6.57 లక్షలు	గొర్రెలు : 10.20 లక్షలు
మేకలు : 3.6 లక్షలు	పెంపుడు కుక్కలు : 30 వేలు


మూగజీవానికి వైద్యం (ఫైల్)

రాని పరిస్థితి

మందుల కొరత ఉందని, త్వరితగతిన జిల్లాకు పంపాలని అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదన కూడా పంపారు. కానీ ఈ కూటమి ప్రభుత్వానికి మాత్రం మూగజీవాల విషయంలో చీమ కుట్టినట్లుగా కూడా లేదనే విమర్శలున్నాయి. ఇండెంట్ పెట్టినా పశువైద్యానికి మందులు రాని పరిస్థితి. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఎప్పుడూ వివిధ రకాల మందులు నిల్వ ఉండేవి. నేటి సర్కారు రైతు భరోసా కేంద్రాలకు పేర్లు మార్చడం, దివంగత వైఎస్సార్ ఫొటోలు తొలగించడంపై పెట్టిన శ్రద్ధ మూగజీవాలకు అండగా ఉండటంపై మాత్రం పెట్టలేదు.

బయట కొనాల్సిందే..

పశు వైద్యశాలల్లో మందులు లేకపోవడంతో పశుపోషకులు, గొర్రెలు, మేకల పెంపకందారులకు తిప్పలు తప్పడం లేదు. డాక్టర్లు చీటీ రాసిస్తే మందులను బయట కొనుగోలు చేసి తమ జీవాలను కాపాడుకుంటున్నారు. గతంలో అన్ని రకాలను ఉచితంగా అందించగా ఇప్పుడు మాత్రం కొనుగోలు చేయాల్సిన పరిస్థితి వస్తోంది.

ప్రతిపాదన పంపాం

జిల్లాలో మందుల కొరతపై ఇటీవలే ప్రభుత్వానికి ప్రతిపాదన కూడా పంపాం. ఈ విషయంపై జిల్లా ఉన్నతాధికారులకు కూడా నివేదిక ఇచ్చాం. త్వరలోనే మందులు రావొచ్చని అనుకుంటున్నాం. ఉన్న కొద్దిపాటితోనే సర్దుబాటు చేస్తున్నాం. మూడునెలలకు ఒకసారి మందులు రావాల్సి ఉంది.
– రమేష్, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి

ప్రేమించాలంటూ గిరిజన బాలికకు వేధింపులు

- ఆత్మహత్యాయత్నం చేసిన బాలిక

నెల్లూరు సిటీ: తనను ప్రేమించాలని, పెళ్లి చేసుకోవాలని లేకపోతే చంపేస్తానని ఓ వ్యక్తి బెదిరింపులకు గురి చేయడంతో 9వ తరగతి చదువుతున్న గిరిజన బాలిక శ్రావణి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన ఆలస్యంగా ఆదివారం వెలుగు చూసింది. పోలీసుల కథనం మేరకు.. నెల్లూరు రూరల్ మండలం కొత్తవెల్లంటి గ్రామానికి చెందిన జాన్ వరికోత యంత్రం డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. అదే ప్రాంతానికి చెందిన బాలికను ప్రేమ పేరుతో ఆరునెలలుగా వేధిస్తున్నాడు. ఈ విషయాన్ని బాలిక పెద్దలకు చెప్పడంతో పలుమార్లు జాన్‌ను హెచ్చరించారు. అయినా అతను మారలేదు. పెళ్లి చేసుకోవాలని, లేకపోతే చంపేస్తానని బాలికను బెదిరించాడు. దీంతో భయపడిపోయిన ఆమె ఈనెల 7వ తేదీన ఎలుకల మందు తిని ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. కడుపునొప్పి తీవ్రం కావడంతో కుటుంబసభ్యులు గుర్తించి నెల్లూరులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతోంది. బాధిత కుటుంబం నెల్లూరు రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేసింది.


బాలికను పరామర్శించిన గిరిజన సంక్షేమ సంఘం జిల్లా చైర్మన్ శేఖర్

అరెస్ట్ చేయాలని డిమాండ్

గిరిజన సంక్షేమ సంఘం జిల్లా చైర్మన్ బీఎల్ శేఖర్ నెల్లూరులోని ప్రైవేట్ చికిత్స పొందుతున్న బాలికను ఆదివారం పరామర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పోలీసులకు ఫిర్యాదు చేసినా నిందితుడిని అరెస్ట్ చేయకపోవడం దారుణమన్నారు. రాజకీయ నాయకుల అండ ఉందని, నన్ను ఎవరు ఏమి చేయలేరని అతను చెబుతున్నాడన్నారు. అరెస్ట్ చేయకపోతే పోరాటం చేస్తామన్నారు.

కోడూరు బీచ్‌లో మృతదేహం


సురేష్ మృతదేహం

తోటపల్లిగూడూరు: మండలంలోని కోడూరు బీచ్‌లో శనివారం గల్లంతైన వ్యక్తి మృతిచెందాడు. ఎస్సై వీరేంద్రబాబు కథనం మేరకు.. కోవూరు మండలం పోతిరెడ్డిపాళెం గ్రామానికి చెందిన ఆత్మకూరు సురేష్ (45) ఓ ప్రైవేట్ కళాశాలలో సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్నాడు. తన కుటుంబసభ్యులతో కలిసి శనివారం కోడూరు బీచ్‌కు వచ్చాడు. అలల తాకిడికి సురేష్ కొట్టుకుపోయాడు. అర్ధరాత్రి వరకు అతడి ఆచూకీ తెలియరాలేదు. ఆదివారం కృష్ణపట్నం పోర్టు సమీపంలోని సముద్ర తీరానికి సురేష్ మృతదేహం కొట్టుకొచ్చింది. సమాచారం అందుకున్న పోలీసులు మృతదేహాన్ని శవపరీక్ష నిమిత్తం నెల్లూరు జీజీహెచ్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

హోరాహోరీగా కబడ్డీ పోటీలు


డీకేడబ్ల్యూ కళాశాల మైదానంలో కబడ్డీ మ్యాచ్ ఆడుతూ..

- విజేతగా నిలిచిన శ్రీసాయి డిగ్రీ కళాశాల జట్టు

నెల్లూరు(టౌన్): విక్రమ సింహపురి యూనివర్సిటీ అంతర్ డిగ్రీ కళాశాలల కబడ్డీ పోటీలను (విద్యార్థినులకు) ఆదివారం నెల్లూరులోని డీకేడబ్ల్యూ డిగ్రీ కళాశాల మైదానంలో నిర్వహించారు. వీటిని ప్రిన్సిపల్ గిరి ప్రారంభించి మాట్లాడారు. క్రీడాకారులు గెలుపోటములను సమానంగా తీసుకోవాలని సూచించారు. ప్రతి విద్యార్థిని క్రీడల్లో పాల్గొనాలని పిలుపునిచ్చారు. 12 జట్లు విచ్చేశాయి. యువతులు ఉత్సాహంగా పోటీల్లో పాల్గొని ప్రతిభ చూపారు. కావలి నుంచి శ్రీసాయి డిగ్రీ కళాశాల జట్టు, నెల్లూరు డీకేడబ్ల్యూ డిగ్రీ కళాశాల జట్టు ఫైనల్స్‌లో హోరాహోరీగా తలపడ్డాయి. శ్రీసాయి డిగ్రీ కళాశాల జట్టు విజేతగా నిలిచింది. అలెక్సా ఫిజికల్ ఎడ్యుకేషన్ కాలేజీ ఇన్‌చార్జి ఎల్.రామచంద్రారెడ్డి ట్రోఫీలను అందజేశారు. కార్యక్రమంలో ఆర్గనైజింగ్ సెక్రటరీ, డీకేడబ్ల్యూ కళాశాల పీడీ విజయకళ, కళాశాల వైస్ ప్రిన్సిపల్ రామారావు, వివిధ కళాశాలల ఫిజికల్ డైరెక్టర్లు పాల్గొన్నారు.


ట్రోఫీ అందుకుంటున్న విజేత జట్టు


రన్నర్స్ జట్టుకు ట్రోఫీ అందజేత


పట్టుకో.. పట్టుకో.. కబడ్డీ పోటీలో తలపడుతున్న యువతులు

నెల్లూరులో కాకాణి జన్మదిన వేడుకలు


రక్తదాన శిబిరం


వృద్ధులకు అన్నదానం

నెల్లూరు(బృందావనం): మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ ఉమ్మడి నెల్లూరు జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి పుట్టినరోజు వేడుకలు నెల్లూరు మాగుంటలే అవుట్‌లోని పార్టీ కార్యాలయంలో ఆదివారం ఘనంగా జరిగాయి. ముత్తుకూరు మండల కన్వీనర్ మెట్టా విష్ణువర్ధన్‌రెడ్డి, యువజన విభాగం నాయకులు దువ్వూరు తేజరెడ్డి, అనంతరాజు శశిధర్, సీపారెడ్డి జానకిరామ్‌రెడ్డి, పోలిరెడ్డి అనిల్‌రెడ్డి, హర్షవర్ధన్, వినయ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. కేక్ కట్ చేశారు. మెగా రక్తదాన శిబిరం, అన్నదానం నిర్వహించారు. ముత్తుకూరు మండలంలోని అన్ని గ్రామాల నుంచి 1,500 మంది ఈ వేడుకల్లో పాల్గొన్నారు. 453 యూనిట్ల రక్తాన్ని నెల్లూరు రెడ్‌క్రాస్‌కు అందజేశారు.

- బాలాజీనగర్‌లోని గీతామయి వృద్ధాశ్రమంలో పాతపాటి హేమంత్‌రెడ్డి, కాటంరెడ్డి భాస్కరరెడ్డిల ఆధ్వర్యంలో 110 మంది వృద్ధులకు అన్నదానం చేశారు. తొలుత కేక్ చేసి పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాతపాటి శరత్‌రెడ్డి, నోటి మదన్‌మోహన్‌రెడ్డి, పి.శివ, జి.ప్రసాద్, ఈ.ప్రసాద్, డి.సాయిచరణ్, డి.సందీప్, నవీన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కమీషన్ తగ్గించి.. ఇబ్బంది పెడుతూ..

కూటమి ప్రభుత్వంపై ఎన్నో ఆశలు పెట్టుకున్న వారికి షాక్‌ల మీద షాక్‌లు తగులుతున్నాయి. అనేకమంది భవిష్యత్ ప్రశ్నార్థకంగా మారుతోంది. ఇరవై ఏళ్లుగా విద్యుత్ శాఖలో మీటర్ రీడర్లుగా పనిచేస్తున్న వారికి కమీషన్‌ను కాంట్రాక్టర్ తగ్గించారు. చంద్రబాబు ప్రభుత్వంలో ప్రజలపై విద్యుత్ చార్జీల భారం మోపారు. ఇప్పుడు మీటర్ రీడర్ల జీవితాలకు ఇబ్బంది ఏర్పడింది.


మీటర్ రీడింగ్ తీస్తున్న సిబ్బంది

- మీటర్ రీడింగ్‌కు ఇచ్చే మొత్తం తగ్గింపు
- రూ.3.73 నుంచి రూ.3.45కు..
- దశాబ్దాలుగా పనిచేస్తున్న వారి ఆవేదన
- స్మార్ట్ మీటర్లతో భవిష్యత్ ప్రశ్నార్థకం

దుత్తలూరు: మీటర్ రీడర్లు.. ఎండ, వానను లెక్క చేయకుండా ప్రతి నెలా తొలివారంలోనే ఇంటింటికీ వెళ్లి విద్యుత్ బిల్లులు తీస్తుంటారు. వీరికి ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో సమస్యలు ఎదురవుతున్నాయి. గత ప్రభుత్వం ఇచ్చిన వేతనం కంటే తగ్గించి ఇస్తున్నారు. దీనిపై ప్రశ్నిస్తే సంబంధిత కాంట్రాక్టర్ బెదిరింపులకు దిగుతున్నట్లు సమాచారం. అంతేకాక స్మార్ట్ మీటర్ల రాకతో జిల్లాలో సుమారు 300 కుటుంబాలు వీధిన పడనున్నాయి.

అన్ని రంగాల్లో..

కూటమి ప్రభుత్వం ప్రతి రంగంలో చిరుద్యోగులపై ఉక్కుపాదం మోపుతోంది. ఇప్పటికే వలంటీర్లు, మద్యం షాపుల్లో పనిచేసే ఉద్యోగులు, ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్లు, మధ్యాహ్న భోజన కార్మికులు.. ఇలా అనేకమందిని తొలగించారు. ఇప్పుడు విద్యుత్ మీటర్ల బిల్లులు తీసే రీడర్లపై సర్కారు గురిపెట్టింది. దీంతో వారు లబోదిబోమంటున్నారు. జిల్లాలో విద్యుత్ శాఖలో 300 మందికి పైగా మీటర్ రీడర్లు పనిచేస్తున్నారు. గతంలో ఒక్కో బిల్లుకు నగరాల్లో రూ.3.60, గ్రామీణ ప్రాంతాల్లో అయితే రూ.3.73 చొప్పున చెల్లించేవారు. సంబంధిత కాంట్రాక్టర్లు రీడర్లకు ఈపీఎస్, ఈఎస్‌ఐ పోను మిగిలినవి అందజేసేవారు. అంతేకాక అప్పుడు డివిజన్ వారీగా కాంట్రాక్టర్లు ఉండేవారు. గత ప్రభుత్వం రీడర్లకు నేరుగా వారి బ్యాంక్ ఖాతాకే వేతనాలు జమచేయాలని విద్యుత్ యాజమాన్యానికి ఆదేశాలు జారీ చేసింది. దీంతో సిబ్బంది ఎలాంటి కోతలు లేకుండా నెలవారీ వేతనం అందుకునే వారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి

జిల్లాలో మీటర్ రీడర్లు దశాబ్దాలుగా పనిచేస్తున్నారు. అయితే ప్రస్తుతం స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేస్తుండటంతో వారంతా అభద్రతాభావంతో ఉన్నారు. గతంలో స్మార్ట్ మీటర్ల ఏర్పాటు దిశగా అడుగులు వేసినప్పుడు ప్రతిపక్ష నేతగా ఉన్న చంద్రబాబు నాయుడు వాటిని తీవ్రంగా వ్యతిరేకించారు. అధికారంలోకొచ్చిన తర్వాత మాట మార్చి ప్రస్తుతం ఆ విధానాన్నే అమలు చేస్తున్నారు. స్మార్ట్ మీటర్ల ఏర్పాటు ప్రక్రియ వేగంగా కొనసాగుతోంది. వీటి ఏర్పాటుతో రీడర్లు ప్రతినెలా రీడింగ్ తీసి బిల్లులు ఇచ్చే పరిస్థితి ఉండదు. మొబైల్ రీచార్జ్ తరహాలో ముందుగా నగదు చెల్లించాల్సి ఉంటుంది. దీంతో రీడర్లు తమ భవిష్యత్‌పై ఆందోళన చెందుతున్నారు. ఉద్యోగ భద్రత కల్పించాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు. యాజమాన్యం నిర్దేశించిన పూర్తిస్థాయి కమీషన్‌ను కాంట్రాక్టర్ చెల్లించాలని డిమాండ్ చేస్తున్నారు.

నేడిలా..

కూటమి ప్రభుత్వం గత ప్రభుత్వంలో ఉన్న కాంట్రాక్టర్లను తొలగించింది. తమ పార్టీకి అనుకూలమైన వారికి జిల్లా మొత్తం బాధ్యతను అప్పగించింది. సదరు కాంట్రాక్టర్ ప్రస్తుతం పట్టణ ప్రాంతాల్లో మీటరుకు రూ.3.15, గ్రామీణ ప్రాంతాల్లో రూ.3.45 వంతున ఇస్తానని, ఇష్టం ఉన్నవాళ్లు ఉండాలని చెబుతున్నట్లు రీడర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కమీషన్ తగ్గించడంతో సుమారు రూ.3 వేల నుంచి రూ.4 వేలు జీతం తగ్గిపోతుందని, దీంతో తమ కుటుంబాన్ని పోషించుకోవడం ఇబ్బందికరంగా మారుతుందని చెబుతున్నారు. అంతేకాక మీటర్ల బిల్లులు 1 నుంచి 7వ తేదీ లోపలే పూర్తి చేయాలని ఆదేశించడంతో ఒత్తిడికి లోనవుతున్నారు.

జిల్లాలో విద్యుత్ కనెక్షన్ల వివరాలు	
కేటగిరీ – 1	9,42,905
కేటగిరీ – 2	1,07,800
కేటగిరీ – 3	4,172
కేటగిరీ – 4	26,436
వ్యవసాయ సర్వీసులు :	2,00,448

గతంలో ఇచ్చినట్టే కమీషన్ ఇవ్వాలి



మేము ఇరవై ఏళ్ల నుంచి సంస్థను నమ్ముకుని మీటర్ రీడింగ్ తీస్తూ జీవిస్తున్నాం. గతంలో ఇచ్చినట్టే కమీషన్ ఇవ్వాలి. అలాగే ఎస్క్రో అకౌంట్ ద్వారా నేరుగా వేతనాలు జమచేయాలి.
– గొల్లపల్లి సాల్మన్‌రాజు, ఏపీ రీడర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు

సరికాదు



కమీషన్ తగ్గించి మా కడుపు కొట్టడం సరికాదు. ఉన్నదాన్ని తొలగించి కొత్తగా కమీషన్ తగ్గించడం భావ్యం కాదు. ప్రస్తుతం పెరిగిన నిత్యావసర ధరలతో కుటుంబం గడవడం కష్టంగా ఉంది. పాత కమీషన్‌ను అందించాలి.
– జి.శ్రీనివాసులు, మీటర్ రీడర్